క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం

మంత్రి కొలుసు పార్థసారథి



ఆగిరిపల్లి: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సబ్ జోన్ బాలబాలికల ఆటల పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల ద్వారా బాల, బాలికల్లో క్రమశిక్షణ, ఆరోగ్యమైన జీవనశైలి మెరుగుపడి విద్యార్థులు చురుకుదనంతో ఉంటారన్నారు. జాతీయ ఐక్యత పెంపొందించడంలో క్రీడలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు మంత్రి బహుమతులు అందజేశారు. ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో జాతీయ సదస్సు

ఆగిరిపల్లి: మండలంలోని పోతవరప్పాడు ఎన్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ సదస్సు సన్‌రైజ్–2025 జరిగింది. సదస్సును కళాశాల చైర్మన్ వెంకట్రావు లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సదస్సు లక్ష్యాలను వివరించారు. ఈ సదస్సు 4,900 మంది విద్యార్థులకు తమ ప్రతిభ, నైపుణ్యాలకు వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగభాస్కర్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, అకడమిక్ కో–ఆర్డినేటర్ కైలాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయ దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ముష్టికుంట్ల(తిరువూరురూరల్): ముష్టికుంట్లలో పునర్నిర్మించిన విజయ దాసాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ, దాసాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగులకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఆశా సొసైటీ సహకారంతో ఇచ్చే అప్రెంటీస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తిరువూరు క్లస్టర్ కో–ఆర్డినేటర్ ప్రసాద్ తెలిపారు. శిక్షణా కాలంలో ప్రతి నెలా రూ.4,500 ఉపకార వేతనం లభిస్తుందన్నారు. ఆసక్తిగలవారు పది, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో తిరువూరు నగర పంచాయతీలోని మెప్మా కార్యాలయంలో అప్రెంటీస్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ఆరు మద్యం సీసాలను, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. మండలంలోని తూర్పు దిగవల్లిలో నిర్వహించిన దాడుల్లో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వీరంకి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. హనుమంతులగూడెంలో నిర్వహించిన దాడుల్లో భూక్యా అనురాధను అదుపులోకి తీసుకొని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనురాధను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఆరీఫ్, నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలను గౌరవించాలి

చాట్రాయి: ప్రతి వ్యక్తి చట్టాలను గౌరవించాలని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. చాట్రాయి వికాస్ జూనియర్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన మహిళ రక్షణ దళ వాహనం ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతపై పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉంటుందని మహిళలు, వృద్ధులు, బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు.

ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తిరువూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. ఐదో తరగతిలో 80, ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు మార్చి 6 వరకు అవకాశం ఉందని చెప్పారు. మే 6న ఉదయం 10 గంటలకు ఐదో తరగతికి, మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. వివరాలకు తమ కళాశాలలో సంప్రదించవచ్చని చెప్పారు.

హామీలేనా.. అమలేదీ?

- ఎమ్మెల్యే కొలికపూడి హామీలు ప్రకటనలకే పరిమితం
- నిధుల సాధనలో విఫలం
- ఎప్పటికప్పుడు కొత్త హామీలు
- 8 నెలల్లో సాధించింది శూన్యం




తిరువూరులో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు (ఫైల్)

తిరువూరు: కూటమి ప్రభుత్వం వస్తే తిరువూరు నియోజకవర్గంలో సమస్యలను కూకటివేళ్లతో సహా పెకిలించి వేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఎన్నికల సమయంలో చేసిన హామీలు ఒక్కటీ నెరవేరలేదని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు. గెలిచిన తర్వాత కూడా పలు సమస్యలను వెంటనే పరిష్కరించేస్తానని, అవసరమైతే తన సొంత నిధులతో పనులు చేయిస్తానని బాహాటంగా ప్రకటించిన ఆయన తదనుగుణంగా కార్యాచరణకు పూనుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శిస్తున్నారు. తిరువూరు, విస్సన్నపేటలలో కొన్ని రోజులు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి ఏమి చర్యలు తీసుకున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. తిరువూరులోని అన్ని వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని 'వార్డు పర్యటన' కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే కొన్ని రోజులకే కార్యక్రమానికి ముగింపు పలికారు. ఎమ్మెల్యే తమ సమస్యలు పరిష్కరిస్తారని ఆశించిన ప్రజలకు ఆయన నుంచి ఎటువంటి స్పందనా కనిపించలేదు.

ఎమ్మెల్యే ఇచ్చిన ప్రధాన హామీల్లో నెరవేరనివి..

- తిరువూరు మెయిన్ రోడ్డులో డ్రెయినేజీల పూడిక తీతకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.24 లక్షల నిధులతో ఎమ్మెల్యే పర్యవేక్షణలో అరకొరగా పనులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. మెయిన్ రోడ్డుపై ఆక్రమణల తొలగింపు అనంతరం రోడ్డు మార్జిన్ల వరకు ఇరువైపులా తారు వేయిస్తానని ఎమ్మెల్యే ప్రకటించినా ఇంతవరకు ఆ పనులు జరగలేదు.
- తిరువూరు మధిర రోడ్డులో ఫ్యాక్టరీ సెంటర్ నుంచి దేవసముద్రం వరకు రోడ్డు విస్తరణ జరిపి డ్రెయినేజీ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఇంతవరకు ఈ పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం కాలేదు.
- జగన్నాథపురం కాలనీలోని రాకెట్ సప్లయ్ చానల్‌పై వంతెన లేక తంగిళ్లబీడు నుంచి ఎంపీపీ పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నందున రూ.20 లక్షల తన సొంత నిధులతో ఈ వంతెన నిర్మిస్తానని ఎమ్మెల్యే నాలుగు నెలల కిందట చెప్పగా ఇంతవరకు పనులు చేపట్టలేదు.
- గంపలగూడెం మండలం వినగడప కట్టలేరుపై వంతెన నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని, నిధులు తెస్తానని ఎమ్మెల్యే ఎన్నికల ముందు, తర్వాత పదే పదే చెప్పినా ఇంతవరకు ఈ పనులకు మోక్షం కలగలేదు.
- తిరువూరు పట్టణ ప్రజలకు రక్షిత మంచినీటి కోసం శాశ్వత ప్రాజెక్టు ఏర్పాటుకై ప్రభుత్వం నుంచి అనుమతి తెస్తానని ఎమ్మెల్యే కౌన్సిల్ సమావేశాల్లో, బహిరంగ సభల్లో చెప్పినప్పటికీ అడుగు ముందుకు పడలేదు.
- తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆన్‌లైన్ బోధనలో భాగంగా తన సొంత ఖర్చుతో డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ సైతం నెరవేర్చలేదు.
- నిరుద్యోగులకు తిరువూరులో కోనేరు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు గత సెప్టెంబర్‌లో ఎమ్మెల్యే ప్రకటించగా, ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.

మాటలే.. చేతల్లేవు



తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాటలకే పరిమితమవుతున్నారు. ఇంతవరకు ఆయన ఇచ్చిన హామీలలో ఒక్కటీ నెరవేరలేదు. అధికారులతో సమన్వయం లేకపోవడంతో కనీసం ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయించలేకపోయిన ఎమ్మెల్యే ఎప్పటికపుడు కొత్త హామీలిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న తిరువూరు నియోజకవర్గంలో కనీసం ఉపాధి కల్పనకు అవసరమైన చర్యలు కూడా తీసుకోలేని ఎమ్మెల్యే అలవికాని వాగ్దానాలిస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

– నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

పోలింగ్ బూత్‌ల పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

మునునూరు: గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేలా పోలింగ్ బూత్‌లను సిద్ధం చేయించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మునునూరు జెడ్పీ హైస్కూల్‌లోని 11, 12 పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, వృద్ధ, దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంపులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, లైటింగ్, మంచినీరు, టాయిలెట్ల సౌకర్యం, ప్రవేశ మార్గం, వెలుపలికి వెళ్లే మార్గాలను పరిశీలించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, పరిష్కార వివరాలు, రీ సర్వే, రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఆర్‌ఐ దీపిక, వీఆర్వో మస్తాన్‌రావు, హెచ్‌ఎం సునీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం



మైలవరంలో వివిధ వేషధారణలో ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు



ఎ. కొండూరు మండలం కోడూరులో మాట్లాడుతున్న రవికుమార్



పెనుగొలనులో తెలుగు కవులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మైలవరం: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అమ్మ భాషే తెలుగు భాషకు శ్వాస అని, అమ్మ ఒడిలో బుడి బుడి మాటలతో ముద్దులొలికే విధంగా పసి పిల్లలు మొదటగా నేర్చుకునేది మాతృభాష అని చెప్పారు. తెలుగు తల్లి, వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి, సరస్వతీదేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు వివిధ వేషధారణలతో అలరించారు. కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం వీడవద్దు

తిరువూరు: విద్యార్థులు ఎంత ఉన్నత స్థితికి వెళ్లినా మాతృ భాషను మరువవద్దని భారతీయ స్టేట్ బ్యాంకు తిరువూరు శాఖా మేనేజరు పి. రవికుమార్ అన్నారు. ఎ.కొండూరు మండలం కోదూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వివిధ హోదాల్లో ఉన్న వ్యక్తులంతా తెలుగు మీడియంలో చదివిన వారేనని, కేవలం ఇంగ్లిష్ మీడియం చదివిన వారికే అవకాశాలుంటాయనే అపోహలు వీడాలని సూచించారు. తెలుగు భాష ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత పరీక్షలను సైతం స్థానిక భాషలో నిర్వహిస్తోందన్నారు. ఎంఈఓ కేశవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొలనులో..

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ పాఠశాలలో షిర్డీ సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు భాష గొప్పదనాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లీలా శంకర్ విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన కవులు, రచయితలకు నివాళులర్పించారు.

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఎంపీపీ పాఠశాలలో ఉర్దూ, తెలుగు మాతృ భాష దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని భవానీ మాట్లాడుతూ ఉర్దూ భాషను అభ్యసిస్తే ఇతర ఏ భాష అయినా సులభంగా నేర్చుకోవచ్చారు. మాతృభాష మన భావోద్వేగాలను వ్యక్తపరిచే ప్రధాన మాధ్యమమని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుతులు అందజేశారు. ఉర్దూ ఉపాధ్యాయులు మహ్మద్ ఇర్ఫాన్‌పాషా, పఠాన్‌ఖాసీం, హఫీజ్ పాల్గొన్నారు.

- చాట్రాయి: తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరావు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు అన్నారని, ఇతర భాషలపై మోజుతో తెలుగు భాషను మరవొద్దని ఆయన కోరారు. అనంతరం తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేశారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



మైలవరంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



తిరువూరు కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మైలవరం: న్యాయవాదుల చట్టం 2025 నూతన బిల్లును వ్యతిరేకిస్తూ మైలవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. మైలవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీటీ కిశోర్ మాట్లాడుతూ న్యాయవాదుల హక్కులు హరించే న్యాయవాదుల చట్టం 1960 సవరణ చేసి 2025 నూతన బిల్లును కేంద్రం ప్రవేశపెట్టాలన్న చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బుద్ధవరపు వెంకట్రావు, మాదు ఆంజనేయులు, రావూరి రమేష్ బాబు, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- తిరువూరు: కేంద్ర ప్రభుత్వం అడ్వకేట్స్ సవరణ బిల్లు తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ తిరువూరు కోర్టు ఎదుట శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ బిల్లు న్యాయవాద వృత్తి స్వయం ప్రతిపత్తికి, స్వాతంత్య్ర భావనకు వ్యతిరేకమన్నారు. ఈ బిల్లు సవరణ ప్రతిపాదన వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వాకదాని లక్ష్మీనారాయణ, గౌస్, సీనియర్ న్యాయవాదులు ఎం. రాంమోహన్‌రాజు, జి. కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



కాట్రేనిపాడులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

మునునూరు: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ విశిష్ట సంఖ్యను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అబీబ్ బాషా అన్నారు. కాట్రేనిపాడు రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ విశిష్ట నంబర్ పొందేందుకు కచ్చితంగా నమోదు చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయంత్రం వరకు నమోదు ప్రక్రియ నిర్వహించాలన్నారు. నూజివీడు ఏడీఏ విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి చినసూరిబాబు, వీహెచ్‌ఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

- నూజివీడు: రైతుల విశిష్ట సంఖ్య నమోదును ఈ నెల 24 లోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా ఆదేశించారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో నిర్వహిస్తున్న రైతుల విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పీఎం కిసాన్ లబ్ధి పొందే రైతులకు దీనిని నమోదు చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, బీమా, పీఎం కిసాన్, వడ్డీ రాయితీ, యంత్ర పరికరాలు తదితర వాటిని అందజేస్తారన్నారు. ఏడీఏ జి.విద్యాసాగర్, ఏఓ చాముండేశ్వరి, వీహెచ్‌ఏ రోహిత్, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

నూజివీడు: బాల్య వివాహాల వలన అనేక దుష్పలితాలు సంభవిస్తాయని, దీనిలో చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ఒకటని నూజివీడు రూరల్ ఎస్‌ఐ ఎన్.లక్ష్మణ్‌బాబు అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభయ రక్షక వాహనం ద్వారా శుక్రవారం యనమదల హైస్కూల్ విద్యార్థులకు బాల్య వివాహాల వలన జరిగే నష్టాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వలన కలిగే అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బాల్యంలో వివాహాలను చేయడం వలన బాలికల బంగారు భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి ఓటీపీ చెప్పకూడదని, లింకులను నొక్కకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలివే ఉత్సవాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీఓ అనూరాధ

మునునూరు: మహా శివరాత్రి మహోత్సవాల్లోనూ, ముగింపు అనంతరం కూడా ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను చేయించాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ అధికారులను ఆదేశించారు. బలివే సచివాలయంలో పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేటాయించిన విధులను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. బలివే ఆలయ, ఉత్సవ ప్రాంగణం, తాత గుడి వీధి, బలివే గ్రామంలోని ప్రధాన వీధులు, సచివాలయం, పాఠశాల ఏరియాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, మండల ప్రత్యేకాధికారి, నూజివీడు డీఎల్పీఓ ఎంపీఎస్ సుందరి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ,ధర్మావతి, సచివాలయాల సిబ్బంది, పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు

దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు



బలివేలో స్వామిని దర్శించుకుంటున్న దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్

బలివే(మునునూరు): భక్తులకు ఇబ్బంది కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు అన్నారు. బలివేలోని రామలింగేశ్వరస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆలయ స్థల పురాణం, నిర్మాణ చరిత్ర, పునర్నిర్మాణం, బలేరామస్వామి మహిమలను ఈఓ పామర్తి సీతారామయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆలయ, ఉత్సవ ప్రాంగణం, స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. మహిళా భక్తుల కోసం ఉత్సవ ప్రాంగణానికి ఇరువైపులా అదనంగా బాత్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, దేవదాయ తనిఖీదారు అనూరాధ పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు కోత!

- బుడమేరు వరదలకు కోతకు గురైన రహదారులు
- పలు చోట్ల పూడ్చకుండా వదిలేసిన అధికారులు
- నిత్యం ప్రమాదాల బారిన వాహనదారులు





చిలుకులవారిగూడెం గ్రామ శివారులో కోతకు గురైన ప్రధాన రహదారి : వెల్లటూరు గ్రామ శివారులో కోతకు గురైన రహదారి

జి.కొండూరు: బుడమేరుకు గత ఆగస్టు నెలలో వచ్చిన వరద ఉధృతికి మైలవరం నియోజకవర్గంలో పలు చోట్ల రహదారులకు గండ్లు పడ్డాయి. అయితే అప్పట్లో రహదారులకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టిన అధికారులు పలు చోట్ల కోతకు గురైన రహదారులను అలానే వదిలేశారు. దీనితో కోతకు గురైన ప్రదేశంలో మొక్కలు పెరిగి రహదారులపై రాకపోకలు సాగించే వాహన చోదకులకు రోడ్డు సరిగా కనిపించక రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. వరదలొచ్చిపోయి ఆరు నెలలు గడిచినా కోతలకు గురైన ప్రదేశాల్లో మరమ్మతులు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జి.కొండూరు మండల పరిధి కందులపాడు నుంచి కోడూరు వెళ్లే రహదారిలో వెల్లటూరు గ్రామ శివారులో రెండు చోట్ల, మైలవరం మండల పరిధి కొత్తగూడెం నుంచి చిలుకులువారిగూడెం వెళ్లే రహదారిలో ఒక చోట రహదారి కోతకు గురై ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అధికారులు వెంటనే స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వెల్లటూరు గ్రామంలో కోతకు గురైన రహదారి

ఓవర్‌టేక్ చేస్తూ ప్రమాదానికి గురైన కారు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నం వైపు నుంచి విజయవాడ వెళుతున్న లారీని కారు ఓవర్‌టేక్ చేయబోయింది. డ్రైవర్ తప్పిదంతో కారు ఎడమ వైపు భాగం లారీ కుడివైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు రోడ్డుకు అడ్డంగా తిరిగింది. లారీ డ్రైవర్ అప్రమత్తతతో బ్రేక్ వేయడంతో కారుపైకి లారీ దూసుకెళ్లకుండా ఆగిపోయింది. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

వాహన చోదకులకు కౌన్సెలింగ్

లక్ష్మీపురం(తిరువూరు రూరల్): లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తిరువూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేశారు. రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు.